వాడినచక్రం - వాడనిపుష్పం

నాకామధ్య కొంత డబ్బొచ్చిపడింది. దాన్ని ఒకరిక్షామీద పెట్టి లాభం పొందాలనుకున్నాను. స్నేహితులు నలుగురూ వొద్దన్నారు. రిక్షా నడిపేవాళ్ళని నమ్మడానికి వీలులేదన్నారు. ఒకరోజున నాలుగు డబ్బులు అదనంగా చేతులో పడగానే, రిక్షాని వూరవతల వొదిలేసి, గంట, లైటు సీట్లు టాపుగుడ్డ వగైరా తీసుకుని పారిపోతారట. రాత్రి ఒంటిగా నగలతో రైలు దిగిన స్త్రీని దోవమళ్ళించి, ఏ మారుమూలో హత్యచేసి నగలతో పారిపోతారు. వారంతా నేరస్థుల తెగకి చెందినవారు. ఇహ నేనెల్లాగూ సైకిల్ రిక్షా తొక్కలేనుకదా, కాబట్టి కొని ప్రయోజనం లేదు.

మరేవిధంగా యీ డబ్బు వినియోగపరచడమా అని ఆలోచిస్తూ కూర్చున్నా మండువాలో. మండువా యిల్లూ చిన్నదేకాని, ఆరుబైట స్థలం బోలెడుంది. చుట్టూ గోడ; మధ్యలో గేటు. గేటు ప్రక్కన మూలగా వొకచిన్నపాక. ఇంటివాళ్ళున్నపుడు దాన్ని పశువులపాకగా వాడేవారేమో తెలియదు. ఇప్పుడదెందుకూ పనికిరాదు. ఇప్పుడంటే టంగ్క్లీన ర్లొచ్చాయికాని, నా చిన్నప్పుడైతే ఆ తాటాకులు నాలిక గీసుకునేందుకు ఉపయోగపడేవి. ఆ పాక కన్నీ కంతలే. ఈసారి పెద్ద గాలివీస్తే తప్పకుండా భూమట్టమైపోతూంది. ఆ పాకముందు వో చెట్టు దానిమీద ఎర్ర పూలు వికసిస్తున్నాయి. చాలా ఎర్రనివి. జీవిత పరిణామంలో ఆ పూలకి ఆ ఎర్రదనం అబ్బివుంటుంది. కొన్ని యుగాల వెనక అంత ఎర్రగా ఉండి వుండవు. వాటికేసి చూస్తూ నా ధనార్జనకి సంబంధించిన ఆలోచనలు నాకు చిన్నతనాన్ని కలగచేశాయి. మనిషి ఆలోచనలు డబ్బు గురించేకదా....

జీవితంలో అందమైనవి, ఆనందాన్ని కలుగచేసేవి, కాని ఖర్చు

లేకుండా లభ్యమవుతాయి. పచ్చగడ్డిమీద పడుకుని ఆకాశంలో మేఘాలకేసి చూడటం, దాహమేసినప్పుడు లోతైన చెరువులో చల్లని నీళ్ళు త్రాగడం, వేసంగిలో బాగా ఆకలేసినప్పుడు కొత్తావకాయ పెరుగుఅన్నం తినడం, ఆరుబైట పడుకుని చందమామ వయ్యారం చూడటం, గాంధీగారి అంచనా ప్రకారం పాతిక రూపాయలతో నెలజీవితం ఆనందంగా గడచిపోతుంది.

ఆ ఎర్రపూలకు కొంచం దూరంగా పాకముందు, వొక రాతిబండ వుంది. ఆ బండ కానించి వొక చక్రం వుంది. బండిచక్రం లాంటిది నిన్న లేదు, ఎక్కడిది ఆ చక్రం? అసలదేమిటి?

పాకలోంచి వో నల్లటివ్యక్తి మరోచక్రం వోబండి తీసుకొచ్చాడు. బండపక్క చక్రాన్ని ఆ బండికి బిగించాడు. పూర్తయిన వాహనం రిక్షా. ఆ నల్లటివ్యక్తి, రాతిబండమీద కూర్చుని, గడ్డాన్ని చేతిమీద ఆనించి దేనికేసో చూస్తూ కూర్చున్నాడు. రోడిన్ అనే శిల్పి కంచులో చెక్కి పోత పోసిన మేధావి—అనే ప్రతిమలా వున్నాడు. రోడిన్ శిల్పంలో వ్యక్తికి మల్లే కండలు తిరిగిలేదు. ఈ వ్యక్తిది ముడతలుపడ్డ పల్చటినల్లటి శరీరం దానికింకా జీవితంలో పేచీ వున్నట్లు లేదు. కోతికీ, ఆదిమానవుడికీ మధ్య వొక ప్రాణి వుండేదట. ప్రాచీన మానవశాస్త్ర పరిశోధకులకి అది యింత వరకూ లభ్యంకాలేదు. ఆ ప్రాణిసంతతివాడు. ఈ వ్యక్తి రాత్రి వర్షంలో ఖాళీగా పాక కనబడితే వొచ్చాడు. అభ్యంతరం లేకపోతే వుంటాడు. నాలుగు రోజులపాటు. మధ్య నా అభ్యంతరం దేనికి? అంగీకారానికి కొంత స్వార్థం లేకపోలేదు. వాడు ఆ పాకలో రాత్రిళ్ళు వుంటే దొంగ భయం వుండదు.

వాడే దొంగేమో? అర్ధరాత్రి నన్నేమన్నా చెయ్యడు కదా....

కాని వాడు అల్పుడు; అర్భకుడు. సృష్టికర్త, తిని పారేసిన పుల్లిస్తరాకు. జంతుజాలం దిగవిడిచిన అంతిమ చిహ్నం. సంఘం వూడ్చిపారేసిన మన్నుపుట్ట. మృత్యువు వాడిచుట్టూ వుచ్చుపోసింది. ఇక లాగటం తరవాయి.

ఆ వ్యక్తి నింకేమీ ప్రశ్నించలేదు. వాడికి తల్లి దండ్రులు, కుటుంబం, కొంప లేవా ? వాడు మట్టిలోంచి రిక్షాతో సహాపుట్టాడు. అందులోనే కాపరం, అందులోనే చావు. మట్టిలో కలిసిపోతాడు. వాడి రక్తంలోంచి మరో ఎర్రనిపువ్వు పుట్టి వికసిస్తుంది. అది రిక్షాఘట్టం, రాజఘట్టంకాదు.

వాడి ఆలోచన ముగిసింది. ఆకలేసినప్పుడే వాడి ఆలోచన. చుట్ట పీకతీశాడు. నిప్పులేదు అగ్గిపుల్ల గీశాడు. ఆకలేస్తే నిప్పుతింటాడు. వెడుతున్నాడు. వెళ్ళాడు. నేలమీద పడ్డ యెర్రపువ్వు రిక్షాచక్రం కింద నలిగింది.

ఇందాక వున్నాడు, ఇప్పుడులేడు. రిక్షాచక్రాలజాడలు నలిగినపువ్వు, గాలిలో కలిసిన చుట్టను తీసి. అంతే వాడి వునికికి నిదర్శనాలు. అంతే జీవితం.

ఆర్థికవేత్తలు ఎవడు సామాన్య మానవుడు ? అని అడుగుతున్నారు. నాకింక సందేహంలేదు. వీడే ఈ రిక్షావ్యక్తి కాయకష్టంచేసి. అలసిన సామాన్యప్రేక్షకుని వినోదం కోసం చిత్రాలు తీస్తున్నాం అంటున్నారు సినిమా వ్యాపారులు. అది మధ్యతరగతి వారి భ్రాంతి వాడు వినోదించడు. వాడి బ్రతుకే వినోదం. వేరే వినోదాలకు సమయం లేదు, వోపికలేదు. సినిమాహాళ్ళముందు వందలాదిగా రిక్షాలు పడివుంటాయి. రిక్షావాళ్ళందరూ వాటిమీదనో కిందనో పడివుంటారు. మన్ను వారి వెండితెర, మట్టిలో పురుగులు వారి అభిమాన నాయికా నాయకులు, రిక్షా యెక్కేవారు వారి దర్శకులు, అణాలబేరం వారి కథావస్తువు.

ఆఫీసు టైము కాగానే యీ వింత ఆలోచనలు ముగిశాయి. నా పొట్ట నింపుకోడానికి నేనూ బయలుదేరాను.

* * *

ఆ సాయంత్రం నేను యింటికి వొస్తుండగా మా వీధి చివర వొక పెద్దగుంపు చేరింది. పెద్దలు పిన్నలు వొకరిద్దరు స్త్రీలు, వొక పోలీసు — మధ్యలో ప్రొద్దున మాయింటి ముందు చూసిన రిక్షావాడు వున్నారు. ఏదేనా

ప్రమాదం జరిగిందేమో చూద్దామని నేనూ గుంపులో చొరబడ్డాను. మనుషులు, చెమట, వేడివూపిరి, వింతధ్వనులు చుట్టుముట్టాయి. గాయపడిన మనిషిగాని, రక్తంగాని కనపడలేదు. అందరూ వింతగా చూపేవారే — మాట్లాడేవారే. విషయం యేమిటో చెప్పరు, పోలీసు ప్రక్కనేవో దవాలీ బంట్రోతు వున్నాడు. అతన్ని ఏమిటని అడిగాను అతను సమాధానం చెప్పలేదు.

"అవుతే ఏంరా వొక మనిషి యెక్కువ బరువా, ఇద్దరు మనుషు లెక్కువ బరువా" అని అడిగాడు రిక్షావాణ్ని "ఒకరే యెక్కువ బరువు" అన్నాడు వాడు. అందరూ విరగబడి నవ్వారు. పిచ్చోడా అంటూ పిల్లలు వాణ్ని దుయ్యబట్టారు.

నవ్వడానికి బలమైన కారణం ఉంది. "పిచ్చివాడు" అనుకోవడంలో తప్పులేదు. ఇద్దరు మనుషులకంటే, ఒకరే యెక్కువ బరువన్నది సృష్టికీ, ప్రకృతికీ విరుద్ధం, యూక్లిడ్, న్యూటన్, రామానుజమ్ మొదలైన గణితశాస్త్రజ్ఞులు ముక్కుమీద వేలువేసుకోరూ, యీ "మేధావి" చేసిన సూచనకి! రెండురెళ్ళు నాలుగన్నది స్వయంప్రకాశమైన సత్యం. మేధావు లున్నా లేకపోయినా, దేవుడున్నా లేకపోయినా, సృష్టి అనంతంలో కలిసి పోయినా ఆ సత్యానికి చలనం లేదు. అల్లాగే ఒకటికంటె రెండు బరు వన్నది. కాని వాడు యీరోడిన్ "మేధావి" రెండు కంటే ఒకటి బరువంటే విజ్ఞానశాస్త్రం లోకజ్ఞాన జగత్తు విస్తుపోక చేసేదేముంది? నవ్వుతారు, దుయ్యబడుతారు, యిది పాకిందంటే నలుగురూ ఏకమై తంతారు. ఈ సామాన్యమానవుడు యిల్లాంటి అసామాన్యమైన సిద్ధాంతాన్ని అమాయక సంఘం నెత్తిన రుద్దుతాడా?

దవాళీ బంట్రోతు ధైర్యంగా ముందుకొచ్చి, "అది యెల్లాగో కొంచెం చూపించరా" అని రిక్షావాణ్ణి సంబోధించాడు. ప్రశ్న, సమాధానం వింతగానే ఉన్నాయి. నా కుతూహలం ఎక్కువైంది. ఒక పెద్దమనిషి

అగ్గిపుల్ల కోసం అటూ, ఇటూ చూస్తున్నాడు. అగ్గిపుల్ల ముట్టించి, ఆయన్ని దూరంగా తీసికెళ్ళి యిదంత ఏమిటని అడిగాను.

గంటక్రితం ఫ్యాక్టరీ యజమాని భార్య, పనిపిల్లని తీసుకుని బజార్లోకి బైలుదేరారుట, మరో రిక్షా కనబడక చిన్న పిల్లేకదా ఫరవాలేదనుకుని యిద్దరూ వాడి రిక్షాలో యెక్కారుట. పనిపిల్లకి పదీ పదకొండేండ్లుంటాయిట. అమ్మగారి కాళ్ళముందు కింద గంపతో సహా కూర్చుందిట. రిక్షావాడు వాళ్ళిద్దరినీ హాయిగా, సునాయాసంగా మోపేశాడుట. మార్కెట్లో సరుకులు కొనుక్కొని గంప పిల్లనెత్తిన పెట్టి, ఇంటికి పంపించి, యజమానురాలు ఒక్కర్తీ రిక్షాలో బయలుదేరిందిట.

ఫ్యాక్టరీ దాటి వారి బంగాళా చేరువలోకి రాగానే రిక్షాపైకి వొదిలెయ్యడం, ఆవిడ రోడ్డుమీద పడిపోవడం, ఫ్యాక్టరీ జవాన్లు నలుగురూ వొచ్చి ఆవిడను ఒక జట్కాలో ఎక్కించి ఇంటికి పంపడం, రిక్షావాణ్ణి నిలేసి పంజాయిషీ అడగటం అదీ జరిగింది.

రిక్షావాడు ఆమెను పడెయ్యాలనే పడేశాడని, గుంపు తీర్మానించింది. ఈ తీర్పుకి ప్రబలమైన కారణాలున్నాయా ? వున్నాయి. రిక్షావాడొకప్పుడు ఆ ఫ్యాక్టరీలో పనిచేశాడు. ఏ కారణం చేతనో వాణ్ని పనిలోనుంచి తీసివేశారు. ఇన్నాళ్ళకి వాడు యజమాని భార్యపై పగసాధించాడు. ఓపికలేక పట్టుజారి వొదిలేశాడంటారా ? అబ్బెబ్బే యీ రిక్షావాండ్ల సంగతి మీకు తెలవదండి. వీళ్ళు ఎంతకేనా సాహసిస్తారు. అంత వోపికలేనివాడు అమ్మగారు పసిపిల్ల యిద్దరూ వుండగా పడెయ్యలేకపొయ్యాడూ అంతే కాదండోయ్ వెళ్ళినకొద్దీ లోతుంది. ఆ పనిపిల్లకీ వాడికీ ఏదో చుట్టరికం ఉందదనా మీ ఊహ ? చూడండి చిత్రం — ఆ పిల్ల దిగింతర్వాతే, అందులో ఫ్యాక్టరీ దగ్గర్లో. యింకా ఏమిటి మీ సందేహం. ఒక్క మనిషే ఎక్కువ బరువట. అదంతా ఏమిటో తెలుసాండి. ఆవిడది స్థూలకాయం....అదంతా, ఎగ తాళన్న మాట. వినండి వాడి సమాధానం

అంటూనే చుట్ట అవతల పారేసి దవాలి బంట్రోతు వెనక్కి ఆసామీ జారబడ్డాడు. ఇద్దరికంటె వాకరెల్లా ఎక్కువ బరువో యిప్పుడు చెప్పమన్నారు. రిక్షావాడు తల తడిమి చూసుకున్నాడు. చేతులు నలుపుకున్నాడు దిగులుగా నాకేసి చూశాడు. "అర్నడగండి" అన్నాడు నాకేసి చూపిస్తూ.

"రిక్షా మోసింది నువ్వైతే అర్నడగడం ఏందిరా ?" అని రెండు మూడుకంఠాలు రొకాయించాయి.

"నే వెట్టాంటివోణ్నో" అన్నాడు రిక్షావాడు. నలుగురిలోనూ, నేనెల్లాగో అయిపొయ్యాను. వాణ్ణి గురించి నాకేం తెలుసు? దేవుణ్ణి గురించి నాకెంత తెలుసో వాణ్ణిగురించి అంతే. దీనికంతా నేను మద్దత్తు అనుకోరు గదా....సమాధానం చెప్పకపోతే, పోలీస్‌స్టేషన్‌కి నడవమన్నారు.

వాడికి సమాధానం తట్టినట్లుంది. "చెప్పనాండి" ఆ పిల్ల మట్టంగా గంపతో నడుంగా కూకున్నప్పుడు, అమ్మగోరు కదలగండా, కుదిమట్టంగా కూకుండిపోయినారు, అటు యిటు కదల్టానికి లేదుగా మరీ....ఊగిసలాత్తానికి లేరుగామరి—రిచ్చా, సమ్మగా కదలకుండా పోద్ది, ఆ పిల్ల దిగేసరికి: ఆరొక్కరేగా. ఓ స్వేచ్ఛ ! ఎనక్కి ముంగలకి సూత్తం, ఊగిసలాడతం పట్టు ఏడకవుద్ది ? అందుకని ఆరిద్దరూ వుండప్పుడు లాగడమే సుకం, అన్నాడు. జనం విరగబడి నవ్వారు. అది తర్కానికతీతమైన అనుభవం, రిషిలాగుతేగాని తెలవదు. ఆధునిక విజ్ఞానశాస్త్రం పురోగమిస్తుంది. నిన్న అవునన్నది యివాళ కాదనడానికి ఆధారాలు దొరుకుతున్నై. కొన్ని శతాబ్దాల పాటు సూర్యుడు భూమిచుట్టూ తిరుగుతోందని నమ్మిన ప్రజ, యిదీ మాత్రం ఎందుకు నమ్మకూడదు ? కాంతి తిన్నగా, సూటిగా, గీట్లుగా ప్రవహిస్తుందంటారా ? సూర్యుడి దగ్గరగా రాగానే, కాంతి కిరణం వొంకర తిరుగుతుంది. స్థలం, లుంగలు చుట్టుకున్న పాముకిమల్లే వంకర తిరుగుతుంది. ఇక్కడనుంచి బైలుదేంతే, విశ్వం అంతా చుట్టి ఎప్పటి

కైనా యిక్కడికే చేరుకుంటాం. అనుభవించే వ్యక్తినిబట్టి సత్యం యొక్క స్వరూపం మారుతూంటుంది. ఈ రిక్షావాడి అనుభవం యిదీ. ఇందులోని స్వారస్యం ఐన్‌స్టయిన్‌వంటి శాస్త్రజ్ఞుల కర్థమవుతుంది.

జనంలో కొందరు వాడు చెప్పింది రైటన్నారు. పగసాధించడం వాడి వుద్దేశమైతే, రిక్షాచక్రం వూడకొట్టుకుంటాడా? లైటు బ్రద్దలు కొట్టుకుంటాడా. గంటలా మోగించే మువ్వలు పోగొట్టుకుంటాడా? అని అడిగారు.

"పోలీసుకు, డవాలి బంట్రోతుకు నమ్మకం కుదరలేదు.

"రిక్షా ఎవరిది?" అని ఎవరో అడిగారు.

"వాడిదేట—సొంతంట" అన్నారు.

రిక్షాకి లైసెన్సు ఏది? లేదు, పోలీసుకు ధైర్యం చిక్కింది. వూడిన చక్రం రిక్షాకి బిగించమన్నారు. వాడు బిగించాడు. ఫ్యాక్టరీ యజమాని బంగళాకి నడవమన్నారు. జనం పల్చబడ్డారు, మెల్లిగా జారుకున్నారు. డవాలి బంట్రోతూ, పోలీసూ ముందు, వెనక నేనూ, మధ్య వూగిసలాడుతూ రిక్షా బంగళాకేసి బైలుదేరాం.

రిక్షా కొని లాభం చెయ్యాలన్న నా సంకల్పం సన్నగిల్లింది. లైసెన్సు యిందాక అంచనా వెయ్యలేదు. దానికి దీపం, గంట, రిపేర్లు చాలా తంతు వుంది. నడిపేవాడికి జబ్బు చేస్తే, మందు యజమాని యిప్పించాలా? ప్రమాదం జరిగితే, నేరస్థుడు లాగినవాడా? యజమానా? వాడి అపస్మారకానికి యజమాని ఎల్లా బాధ్యుడు? ఇదంతా గందరగోళంగా తోచింది.

యజమాని బంగళాకి చేరుకున్నాం. ఆయనా యీలోగా ఆరాలు తీశాడు. ఈ రిక్షావాడు పనిచేసింది: వారి ఫ్యాక్టరీలో కాదట మరో ఫ్యాక్టరీలో నట. అమ్మగారికి ఏ విధమైన ప్రమాదమూ జరగలేదు, వాణ్ణి వొదిలెయ్యండి, అని డవాలీ బంట్రోతుకి వుత్తరువు చేశారు. అమ్మగారు

పందిట్లో నిలబడి వున్నారు. పో అన్నట్లు సంజ్ఞ చేశారు. పోలీసు "ఈపారి వొళ్ళదగ్గర పెట్టుకుని నడుపుతూండు" అని గర్జన చేసి రిక్షాని ఒక్క కుదుపు కుదిపి చక్కా వెళ్ళాడు.

ఆ కుదుపుతో రిక్షాచక్రం మళ్ళా వూడింది. ఆ చక్రం, రెండు ఆకుల నడుమ చిక్కుకున్న ఎర్రపువ్వు కిందపడింది. రిక్షావాడు ఆ పువ్వుని తీసి, దులిపి అమ్మగారి దగ్గరకొచ్చి చేతిని చాచాడు— "ఇందండి" అన్నాడు పువ్వు తీసుకోమని. ఆవిడ కళ్ళు సంతోషంతో మెరిసినై, తనకోసం అనుకుని.

"నీకేం భయంలేదు పోరా" అంది ఆవిడ, ఆ పువ్వుని తీసుకోబోతూ. "ఆ పిల్ల తల్లోదండి" అన్నాడు రిక్షావాడు. ఆవిడ కనుబొమ్మలు చిట్లించింది. దూరంగా అరుగుమీద పసిపిల్ల ఏదో సర్దుతోంది. పరుగెత్తుకుంటూ వెళ్ళి రిక్షావాడు ఆ పువ్వుని ఆ పిల్లకిచ్చాడు.

"భద్రం పూలే పారేసుకున్న దానవు, రేపు మొగుణ్ణెం పెట్టుకుంటా" అని నవ్వి వెనక్కి వచ్చి రిక్షా చక్రం బిగించుకుంటున్నాడు.

లైసెన్సు సంగతి జ్ఞాపకం వొచ్చింది గావును, పోలీసు మళ్ళా వచ్చాడు. లైసెన్సు డబ్బుకి నేను హామీ యిచ్చి అతణ్ణి పంపివేశాను. రిక్షా ఎక్కడ ఎక్కమంటాడోనని చరచరా నడుచుకుంటూ వొచ్చేశాను. నా అభిప్రాయం వొకటి తప్పని ఋజువైంది. ఏదేనా కావచ్చు గానీ, రిక్షావాడు సామాన్య మానవుడు మాత్రంకాదు.